# ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Districts

సంపుటి - 01 సంచిక -331 పేజీలు - 08 వెల - 06/- గురువారం 6 మార్చి 2025


# ఎపిని గట్టెక్కించండి



- ఆర్థికమంత్రి నిర్మలా సీతారమన్‌కు చంద్రబాబు వినతి
- హోంమంత్రి అమిత్ షా, గడ్కరీలతో భేటీ

**న్యూఢిల్లీ,మార్చి05(రిపబ్లిక్ న్యూస్)** ఎపిని ఆర్థికంగా ఆదుకునేందుకు ఇతోధికంగా నిధులు అందించాలని కేంద్రానికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విన్నవించారు. ఈ మేరకు ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌తో చర్చించారు. దిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రులతో వరుసగా భేటీ అయ్యారు.మధ్యాహ్నం కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి.. అరకు కాఫీతో పాటు ఓ జ్ఞాపికను అందజేశారు. చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్.. అమిత్ షాతో సమావేశమై వివిధ అంశాలపై దాదాపు గంట పాటు చర్చించారు. అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్‌ను కలిశారు. చంద్రబాబుతో పాటు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కూడా నిర్మలా సీతా రామన్‌ను కలిసి.. రాష్ట్ర బ్జడెట్ ప్రతులను ఆమెకు అందజేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి,మిగతా2లో...

# ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీలు

- జనసేన నుంచి నాగబాబు పేరు ఖరారు
- నామినేషన్‌కు సిద్దంగా ఉండాలని పవన్ సూచన



**అమరావతి,మార్చి05(రిపబ్లిక్ న్యూస్)** ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సోదరుడు కొణిదెల నాగబాబు పేరు ఖరారైంది. ఎమ్మెల్యేల కోటాలో నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికలకు కూటమిలో భాగంగా జనసేన అభ్యర్థిగా నాగబాబు పేరును పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ ఖరారు చేశారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నాగబాబు సేవలందిస్తున్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయాలని నాగబాబుకు పవన్ సమాచారం ఇచ్చారు. నామినేషన్‌కు అవసరమైన పత్రాలు సిద్ధం చేయాలని పార్టీ కార్యాలయాన్ని పవన్ కళ్యాణ్ ఆదేశించారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మొత్తం ఐదు స్థానాల్లో ఒకరి అభ్యర్థి పేరు ఖరారైంది. జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబు పేరును ఖరారు చేస్తూ పవన్ కళ్యాణ్ అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న నాగబాబును ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నుకుంటారని ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల సీఎం చంద్రబాబుతో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. దాదాపు గంటపాటు ఈ భేటీ జరిగింది. ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబు ఎంపికపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అంతకుముందు నాగబాబును కేబినెట్‌లోకి తీసుకుంటామని ప్రకటించిన మిగతా 2లో

# అహంకారానికి నిలువెత్తు రూపం జగన్

- విధ్వంసం చేసిన రాష్ట్రాన్ని గాడిన పెడుతున్నం
- అసెంబ్లీకి రాకుండా అబద్ధాలు చెబితే ఎలా
- అధికారం ఉన్నా..లేకున్నా జగన్ ఎప్పుడూ ప్రజలకు దూరమే
- జగన్ విమర్శలపై కౌంటర్ ఇచ్చిన మంత్రి లోకేశ్

**అమరావతిమార్చి05(రిపబ్లిక్ న్యూస్)** అహంకారానికి ప్యాంటు, షర్టు వేస్తే జగన్ లాగే ఉంటుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అసెంబ్లీకి రాకుండా ఇంట్లో కూర్చుని అబద్ధాలు చెబితే ప్రజలు నమ్మరని అన్నారు. అసెంబ్లీకి వచ్చి మాట్లాడితే నిజాలంటే మేమూ చెబుతామని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్నా,



కోల్పోయినా జగన్ ప్రజలకు మిగతా 2లో

# సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు టోపీ

- లెక్కలు తప్ప...అన్నింటా సున్నాలే
- బడ్జెట్ గారడీ అని తేలిపోయింది.
- నిరుద్యోగ భృతి పేరుతో మోసం
- 4లక్షల ఉద్యోగాల కల్పన ఓ దగా
- మా హయాంలో 40 లక్షల ఉద్యోగాలు ఇచ్చాం
- పరిశ్రమలు వెనక్కి పోతున్నాయి
- గతానికి..నేటికీ తేడాను ప్రజలు గుర్తించారు
- అసెంబ్లీలో మాట్లాడే అవకాశం లేదు కనుకే మీడియా ముందుకు వచ్చా
- బడ్జెట్‌పై నిలదీసిని వైకాపా అధినేత జగన్

**అమరావతి,మార్చి05(రిపబ్లిక్ న్యూస్)**కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం పేరుతో ప్రతీ వర్గాన్ని చంద్రబాబు మోసం చేశారని, బడ్జెట్ గారడీతో అది బయటపడిందని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో ఆయన బడ్జెట్ వ్యవహారాలపై మీడియాకు వివరించారు. అసెంబ్లీలో ప్రతిపక్షం చెబుతున్న మాటలు వినడం లేదు. అందుకే మీడియా ముందుకు వచ్చాం. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రెండు బడ్జెట్‌లు ప్రవేశపెట్టింది. సూపర్ సిక్స్, 143 హామీల కోసం అరకొర కేటాయింపులు చేశారు. అన్నిరకాలుగా మోసం చేసిన తీరు తేటతెల్లంగా కనిపిస్తోందని అన్నారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కాస్త బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ అయ్యింది. ఎన్నికలకు ముందు సూపర్



సిక్స్, సెవెన్ అంటూ ఊదరగొట్టారు. చంద్రబాబు దత్తపుత్రుడు కలిసి మేనిఫెస్టో రిలీజ్ చేశారు. ప్రతీ ఇంటికి బాండ్లు పంచారు. 20 లక్షల ఉద్యోగాలు,. రూ.3 వేల నిరుద్యోగ భృతి సాయం అన్నారు. ఇప్పుడు హామీలపై అడిగితే సమాధానం లేదు. రెండు బడ్జెట్‌లలోనూ నిధులు కేటాయించలేదు. ప్రజలను మోసం చేసిన తీరు స్పష్టంగా కనిపిస్తోంది. తొమ్మిది నెలల్లోనే 4 లక్షల ఉద్యోగాలు ఇచ్చేశామని చెప్పారు . గవర్నర్‌తో అబద్దాలు చెప్పించారని అన్నారు. ఆత్మస్తుతి పరనింద అన్నట్లుగా బడ్జెట్ ప్రసంగం ఉంది. తొలి బడ్జెట్ లో కేటాయిచింది మిగతాది 2లో...

# సిఐడి నోటీసులపై స్టే ఇవ్వండి

- హైకోర్టులో దర్శకుడు రామ్ గోపాల్ వర్మ పిటిషన్

**అమరావతి,మార్చి05(రిపబ్లిక్ న్యూస్)** ఏపీ హైకోర్టులో సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ పిటిషన్ దాఖలు చేశారు. తనకు ఇచ్చిన సీఐడీ నోటీసులపై స్టే ఇవ్వాలని పిటిషన్ లో కోరాడు రామ్ గోపాల్ వర్మ. కమ్మ రాజ్యంలో కడప రెడ్లు' సినిమాపై ఒంగోలు, అనకాపల్లి, మంగళగిరిలో సీఐడీకి ఫిర్యాదులు అందాయి. దానికి తోడు విద్వేషాలు రెచ్చగొట్టేలా సినిమాను చిత్రీకరించారని వర్మపై గతంలోనే ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో విచారణకు హాజరు కావాలని వర్మకి సీఐడీ నోటీసులు జారీ చేసింది. దీంతో సీఐడీ నోటీసులను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించాడు ఆర్జీవీ. రేపు విచారణకు వచ్చే ఛాన్స్ ఉందని అంటున్నారు. ఇప్పటికే వ్యూహం సినిమాకు సంబంధించి ఇప్పటి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అలాగే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ను కించపరిచేలా సినిమా తీసాడని ఆర్జీవీపై కేసు నమోదు అవగా ఒంగోలులో విచారణకి హాజరయ్యాడు ఆర్జీవీ. ఇప్పుడు సీఐడీ అధికారుల నోటీసులు నేపథ్యంలో విచారణకు మినహాయింపు కోరుతూ హైకోర్టును ఆశ్రయించాడు రామ్ గోపాల్ వర్మ.



# భోగాపురం ఎయిర్‌పోర్టుకు మెట్రో కనెక్టివిటీ

- అసెంబ్లీలో మంత్రి నారాయణ వెల్లడి



**అమరావతి,మార్చి 05(ఆంధ్రపక్షం):** భోగాపురం ఎయిర్ పోర్ట్‌కు గాజువాక నుంచి ట్రాఫిక్ రద్దీ తగ్గింపు, కొత్త రోడ్ల నిర్మాణంపై అసెంబ్లీలో మంత్రి నారాయణ సమాధానం ఇచ్చారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి మిగతాది 2లో...

# సభలో బలం మేరకే ప్రతిపక్ష హోదా

- హోదా కోసం జగన్ హైకోర్టుకూ వెళ్లారు
- బెదరింపు తరహాలో తనకూ లేఖ రాశారు
- హోదా అన్నది స్తే రాదని స్పష్టం చేసిన స్పీకర్



# ఎన్నికల ముందు ఎగిరెగిరి పడ్డ జగన్



- ఇప్పుడేమో ఎదురుదాడి విమర్శలు
- పవన్ గురించి మాట్లాడే అర్హత లేదు
- మండిపడ్డ మంత్రి నాదెండ్ల మనోహర్

**అమరావతి,మార్చి05(రిపబ్లిక్ న్యూస్)** వై నాట్ 175 అని ఎగిరిన మనిషి 11కు పడిపోవడంతో మతి భ్రమించి, ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని మాజీ సీఎం జగన్‌పై పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తీవ్రంగా విమర్శలు గుప్పించారు. జర్మనీ చట్టాలు ఏపీలో అమలు చేస్తానంటే ఎలా? అని ప్రశ్నించారు. తాడు బొంగరం లేని పార్టీ వైసీపీ అని సెటర్లు వేశారు. ఇంగిత జ్ఞానం లేదు కాబట్టే తనకు తాను శాశ్వత పార్టీ అధ్యక్షుడిగా జగన్ ప్రకటించుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ప్రజా జీవితంలో ఒక్క రూపాయి అయినా ఇచ్చి దాతగా జగన్ నిలబడ్డాడా ? పవన్ కళ్యాణ్ వేలాదిమందికి ఆర్థిక సాయం చేశారని అన్నారు.నిన్నటి పట్టభద్రుల ఎన్నికల్లో తీర్పు ఇచ్చింది యువత కాదా? సూపర్ 6 గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. మాటకు కట్టుబడి ఉంటూ విలువలతో కూడిన రాజకీయాలు చేయటం జగన్ అలవాటు చేసుకోవాలని సూచించారు. రైతులకు ధాన్యం కొనుగోళ్ల బకాయిలు పెట్టి వెళ్లిపోయిన వాడు ఇవాళ రైతుల గురించి మాట్లాడుతున్నాడని అన్నారు.మిగతాది 2లో...

## మంత్రి బొత్సపై అమరావతి రైతుల ఫిర్యాదు

**గుంటూరు,మార్చి05(రిపబ్లిక్ న్యూస్):** గుంటూరు జిల్లాలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణపై రాజధాని అమరావతి రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శాసనమండలిలో అమరావతిని స్మశానంతో పోలుస్తూ బొత్స మాట్లాడారు. దీంతో బొత్స వ్యాఖ్యలు తమ మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని రాజధాని రైతు కంచర్ల జగన్మోహనరావు, అమరావతి బహుజన ఐకాస అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య ఆరోపించారు. ఈ మేరకు తుళ్లూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

## ఎపిని ఆర్థికంగా గట్టెక్కించండి

(మొదటి పేజీ తరువాయి)

ఏపీకి ఆర్థికంగా మరిన్ని వెసులుబాట్లు కల్పించే అంశంపై నిర్మలా సీతారామన్‌తో సీఎం, ఆర్థిక మంత్రి చర్చలు జరిపారు. ఇటీవలే ఏపీలో ప్రవేశపెట్టిన బ్జడెట్ వివరాలను ఆమెకు వివరించారు. క్యాపిటల్ ఎక్స్ పెడించర్ నిధుల కోసం ప్రత్యేకంగా వీజీఎఫ్ స్కీం ప్రవేశపెట్టడంపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశంలో తొలిసారిగా ఈ తరహా విధానం ఉందన్న చర్చల్లో భాగంగా నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు. వీజీఎఫ్ స్కీంలో భాగంగా కార్పస్ ఫండ్ నిమిత్తం రూ. 2 వేల కోట్లు కేటాయించామని సీఎం చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల వివరించారు. వివిధ మార్గాల్లో ఇప్పటి వరకు అందించిన సాయంపై నిర్మలా సీతారామన్‌కు ఏపీ సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఇక పైనా ఇదే తరహా సహకారం ఉండాలని.. వీలైనన్ని కేంద్ర పథకాలను రాష్ట్రంలో అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, తమకు నిధులు కూడా అదే స్థాయిలో వచ్చేలా చూడాలని కోరారు. తరవాత మరోమంత్రి నితిన్ గడ్కరీతోనూ భేటీ అయ్యారు. వివిధ రోడ్లకు సంబంధించి సిఎం చర్చించారు.

## భోగాపురం ఎయిర్‌పోర్టుకు మెట్రో కనెక్టివిటీ

(మొదటి పేజీ తరువాయి)

అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ... విశాఖపట్నంలో భోగాపురం ఎయిర్ పోర్ట్‌కు వెళ్లేందుకు ట్రాఫిక్ రద్దీ తగ్గింపునకు మెట్రోతో పాటు కొత్త రోడ్ల ప్రతిపాదనలు ఉన్నాయని గుర్తుచేశారు. ట్రాఫిక్ నివారణకు విశాఖ మెట్రో ప్రతిపాదన ఉందని చెప్పారు. గాజువాక నుంచి భోగాపురం వరకూ మద్దిలపాలెం, మధురవాడ మీదుగా 34.6 కిలోమీటర్లు మెట్రో నిర్మాణం జరుగుతుందని అన్నారు. మెట్రో ప్రతిపాదనలు కేంద్రానికి పంపించామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఖచ్చితంగా ఆమోదం పొందేలా చూస్తామని... ఆమోదం రాగానే పనులు ప్రారంభిస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. విశాఖపట్నంలో మెట్రో రైలు వస్తే ట్రాఫిక్ కొంతమేర తగ్గుతుందని.. కానీ మెట్రో ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి నాలుగేళ్ల సమయం పడుతుందని తెలిపారు. ఏహెచ్ 45 రోడ్డుపై ట్రాఫిక్ తగ్గించడానికి 15 అంతర్గత రోడ్లు ఏడాదిన్నరలోగా పూర్తయ్యేలా అధికారులను ఆదేశించానని అన్నారు. పాత హైవే ఏహెచ్ 47 నుంచి ఎన్ హెచ్ 16కు ఆరు రోడ్ల ప్రతిపాదన ఉందని గుర్తుచేశారు. విశాఖలోని ఎమ్మెల్యేలు, అధికారులతో మీటింగ్ పెట్టాలని మంత్రిని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు కోరారు. వచ్చే వారమే మీటింగ్ పెడతానని మంత్రి నారాయణ సభలో చెప్పారు.

## ఎన్నికల ముందు ఎగిరెగిరి పడ్డ జగన్

(మొదటి పేజీ తరువాయి)

నిజాయితీగా ఒక్కరోజైనా జగన్ పనిచేశాడా? అని ÷ర్ అయ్యారు. అధికారంలో ఉండగా వర్క్ ఫ్రమ్ హోమ్ ముఖ్యమంత్రిగా ముద్రపడిన వ్యక్తి కాస్త ఇప్పుడు వర్క్ ఫ్రమ్ బెంగుళూరు ఎమ్మెల్యేగా మారాడని కామెంట్స్ చేశారు. జగన్ కోడికత్తికి ఎక్కువ, గొడ్డలికి తక్కువ అని మేం అనలేక కాదు, మాకు సభ్యత ఉందని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసి తీరుతుంది.

## ఆడుదాం ఆంధ్రా అవకతవకలపై కమిటీ: మంత్రి

**అమరావతి,మార్చి05(రిపబ్లిక్ న్యూస్):** ఆడుదాం ఆంధ్రా‘లో జరిగిన అవకతవకల పట్ల పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు చాలా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని శాసన మండలిలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని లోతుగా పరిశీలించడానికి ఒక ఇండిపెండెంట్ కమిటీతో విచారణ వేసి 45 రోజుల్లో నివేదిక సమర్పిస్తామని అన్నారు. ‘ఆడుదాం ఆంధ్రా‘ పేరిట తప్పుచేసిన అధికారులు ప్రజా ప్రతినిధుల పాత్రల గురించిన రిపోర్ట్ సభకు అందజేస్తామని అన్నారు. ‘ఆడుదాం ఆంధ్రా‘ కోసం గత వైసీపీ ప్రభుత్వం మొత్తం రూ.119 కోట్లు ఖర్చు చేసిందని చెప్పారు. ఈ మొత్తాన్ని ఆర్ అండ్ బీ, స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్, జిల్లా కలెక్టర్స్ ద్వారా ఖర్చు చేశారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.



## ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీలు

(మొదటి పేజీ తరువాయి)

విషయం తెలిసిందే. దీనిపై సోషల్ మీడియాలో నెగిటివ్ కామెంట్స్ రావడాన్ని గమనించిన జనసేన ఆయనకు రాజ్యసభకు పంపాలని భావించారు. విజయసాయి రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన స్థానంలో నాగబాబును పంపించాలని అనుకున్నప్పటికీ ఆ స్థానాన్ని ఖాళీ చేయించింది బీజేపీ కాబట్టి... ఆ స్థానాన్ని కమలం పార్టీకి వదలాలి అనే సూచనలు కూడా వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో బుధవారం ఉదయం సీఎం చంద్రబాబుతో మాట్లాడిన తర్వాత పవన్ కళ్యాణ్... ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీగా నాగబాబు పేరును ఖరారు చేసినట్లు జనసేన పొలిటికల్ సెక్రటరీ, ఎమ్మెల్సీ హరిప్రసాద్ అధికారికంగా జనసేన గ్రూప్‌లో పోస్ట్ చేశారు. ఈనెల పదవ తేదీలోపు నామినేషన్ వేయాల్సిన నేపథ్యంలో మంచి రోజు చూసుకుని నాగబాబు నామినేషన్ దాఖలు చేసే అవకాశం ఉంది. అలాగే మిగిలిన నలుగురు ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లు కూడా ప్రకటించగా.. ఐదుగురు కలిసి నామినేషన్ వేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇక ఐదుగురు ఎమ్మెల్సీలో నాగబాబు పేరు ఖరారవగా.. మిగిలిన నాలుగు ఎమ్మెల్సీ అభ్యర్థుల పేర్లను ప్రకటించాల్సి ఉంది. అయితే నాగబాబు రాజ్యసభకు వెళ్తే ఐదు ఎమ్మెల్సీల్లో ఒకటి టీడీపీ నుంచి వంగవీటి రాధాకు ఇస్తారనే అంతా భావించారు. కానీ ఇప్పుడు ఎమ్మెల్సీగా నాగబాబు పేరు ఖరారు చేయడంతో ప్రస్తుతం ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈరోజు సీఎం చంద్రబాబు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఆయన తిరిగి వచ్చిన తర్వాత కేబినెట్ సమావేశం అనంతరం ఎమ్మెల్సీలు ఎవరనేది ప్రకటించనున్నట్లు సమాచారం. అయితే ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి బీజేపీ అడుగగా.. ఇప్పటికే ఒక స్థానం నాగబాబుకు ఇచ్చేయడంతో బీజేపీకి ఇచ్చే అవకాశం లేదని చంద్రబాబు ముందుగానే స్పష్టం చేసినట్లు తెలిసింది. మరి మిగిలిన నాలుగు ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులు ఎవరు అనేది ఉత్కంఠంగా మారింది.

## బాహుబలి బడ్జెట్ అంటూ గొప్పలు

(మొదటి పేజీ తరువాయి)

బోడి సున్నా. ఈ ఏడాది కూడా నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. ప్రతి నిరుద్యోగికి భృతి రూ.72 వేలు ఎగనామం పెట్టారు. 2024-25 సోషియో ఎకనమిక్ సర్వేలో ఎంఎస్ఎంఈ సెక్టార్‌లో 27 లక్షల ఉద్యోగాలిచ్చామని చెప్పారు. బడ్జెట్ లో ప్రతిపాదించకుండా లక్షల ఉద్యోగాలు ఎలా ఇచ్చారని అన్నారు. జగన్ చెప్పినదానికంటే ఎక్కువ ఇస్తున్నామని ఫోజులు కొడుతున్నారు. ఉద్యోగాలు ఇవ్వకపోగా.. ఉన్న ఉద్యోగాలను పీకేస్తున్నారు. పారిశ్రామిక వేత్తలను బెదిరిస్తున్నారు. ఏపీ రావాలంటే కంపెనీలు భయపడుతున్నాయన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో వివిధ సెక్టార్‌లో ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్య 6 లక్షలు. మొత్తం మా పాలనలో అన్నీ రంగాలకు కలిపి 40 లక్షల పైచిలుకు ఉద్యోగాలిచ్చాం. ఆధార్ కార్డులతో సహా ఆ వివరాలు చెప్పగలం. ఇది ఎవరూ కాదనలేని సత్యాలని అన్నారు. 18 నుంచి 60 ఏళ్ల మహిళకు సంవత్సరానికి రూ.18 వేలు ఆడబిడ్డ నిధి అన్నారు. దానికి ఎగనామం పెట్టారు. ఉచిత బస్సు కోసం మహిళలంతా ఎదురు చూస్తున్నారు. ఉచిత ప్రయాణాలు ఎప్పుడెప్పుడు చేస్తామా అని ఆశగా చూస్తున్నారు. మహిళల సంక్షేమం పేరిట ఈ హామీతో రూ.7 వేల కోట్లు ఎగ్గొట్టారు. స్కూల్‌కి వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేల సాయం అన్నారు. ఎంత మంది ఉంటే అంత మందికి ఇస్తామని అన్నారు. తల్లికి వందనం కోసం మొదటి బడ్జెట్ లో రూ. 5, 386 కోట్లు కేటాయింపులు చేశారు. ఈసారి నెంబర్ మోసంతో ప్రజలను మభ్య పెడుతున్నారు. ఎలాగూ మోసం చేసేది కదా అని ఇలా చేస్తున్నారు. చివరికి చిన్న పిల్లాడికి కూడా బకాయిలు పెడుతూ.. ఎగనామం పెడుతున్నారు. చంద్రబాబుకి రైతులను మోసం చేయడం కొత్తేం కాదు రైతు భరోసా పేరిట రైతన్నలను గతంలోనే కాదు.. ఇప్పుడూ మోసం చేస్తున్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేల సాయం అందిస్తామన్నారు. కిందటి ఏడాది ఎగ్గొట్టారు. ఈసారి కూడా ఆ పని చేస్తే.. రెండు బ్జడెట్‌లకు కలిపి రూ.40 వేలు ఎగనామం పెట్టినట్లు అవుతుంది. దీపం పథకం కింద మరో మోసానికి దిగారు. ఎలాగూ ఎగనామం పెట్టేదే కదా.. మోసమే కదా అని కేటాయింపులు చేసుకుంటూ పోయారు. చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం.. 50 ఏళ్లు నిండిన వాళ్లకు పెన్షన్ల విషయంలో మరో 20 లక్షల మంది జత కావాల్సి ఉంది. రెండేళ్లలో రూ.96 వేల చొప్పున మోసం చేశారు. సూపర్ సిక్స్.. సెవెన్ కింద అన్ని పథకాలకు కలిపి మొత్తం.. దాదాపు రూ.80 వేల కోట్లు కావాలి. కిందటి ఏడాది రూ.7 వేల కోట్లు పెడితే.. రూ.800 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు. మరో పది మందిని లాగుదామంటే నేనే వద్దన్నా.. ఏం మాట్లాడతావో మాట్లాడు.. నేను వింటా అని చంద్రబాబుకి ప్రతిపక్ష హోదా ఇచ్చా. ఇదే ఆయనకు నాకు తేడామైక్ ఇస్తేనే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయి. అది ఇవట్లేదు కాబట్టే ఇలా మీడియా ముందుకు రావాల్సి వస్తోందని అన్నారు. టీడీపీ తర్వాత జనసేన అతిపెద్ద పార్టీ అని.. కాబట్టి తాము ఉండగా ఈ ఐదేళ్లు వైఎస్సార్‌సీపీకి ప్రధాన ప్రతిపక్ష హోదా రాదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారని మీడియా ప్రతినిధులు జగన్ వద్ద ప్రస్తావించారు. పవన్ కల్యాణ్ అనే వ్యక్తి కార్పొరేటర్‌కు ఎక్కువ.. ఎమ్మెల్యేకు తక్కువ. జీవిత కాలంలో ఒక్కసారి ఆయన ఎమ్మెల్యే అయ్యారు అని జగన్ సెటైర్ వేశారు. అసెంబ్లీలో ప్రతిపక్షం వర్షన్ వినిపించే అవకాశం లేకపోవటంతో.. తమ వైపు నుంచి ప్రజలకు వివరించటం కోసమే ఈ సమావేశం అని తెలిపారు.

## సభలో బలం మేరకే ప్రతిపక్ష హోదా

- **హోదా కోసం జగన్ హైకోర్టుకూ వెళ్లారు**
- **బెదరింపు తరహాలో తనకూ లేఖ రాశారు**
- **హోదా అన్నది స్తే రాదని స్పష్టం చేసిన స్పీకర్**



**అమరావతి,మార్చి05(రిపబ్లిక్ న్యూస్)** ప్రతిపక్ష హోదాపై నిరాధార ఆరోపణలతో వైకాపా ఎమ్మెల్యే జగన్ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. బుధవారం సభ ప్రారంభం కాగానే ఆయన మాట్లాడారు. ‘ప్రతిపక్ష హోదాపై వైకాపా ఎమ్మెల్యే జగన్ హైకోర్టుకు కూడా వెళ్లారు. న్యాయ పక్రియ కొలిక్కి వచ్చేవరకు వేచి చూద్దామకున్నా. ఇటీవల జగన్, వైకాపా సభ్యులు చేసిన వ్యాఖ్యలు నా దృష్టికి వచ్చాయి. ఎంతటివారిపైనైనా అసత్యాలు ప్రచారం చేసే ధోరణితో జగన్ వ్యవహరిస్తున్నారు. వారు చేస్తున్న ఆరోపణలు గందరగోళానికి దారి తీస్తున్నాయి. స్పీకర్‌కు దురుద్దేశాలు ఆపాదించడం సభా నియమాల ఉల్లంఘన కిందికి వస్తాయి. దేవుడు తిరస్కరించిన వరాన్ని పూజారి నుంచి ఆశించడం తప్పని అయ్యన్న వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే సరైన సంఖ్యా బలం ఉండాలని చట్టం చెబుతోంది. 175 మంది సభ్యులున్న శాసనసభలో కనీసం 18 మంది సభ్యుల బలం ఉంటే తప్ప ప్రతిపక్ష హోదా రాదు. అంటే కనీసం 10 శాతం సభ్యులు ఉంటేనే ప్రతిపక్ష హోదా వస్తుందనే నిబంధనను గతంలో జగనే సభలో ప్రస్తావించారు. ఇవన్నీ తెలిసీ జగన్ చేసిన ప్రేలాపనలను సభాపతి హోదాలో క్షమించి వదిలేస్తున్నా. అభియోగాలు, ప్రేలాపనలు, బెదిరింపులతో జగన్ నాకు గత ఏడాది జూన్ 24న లేఖ రాశారు. ప్రతిపక్ష హోదా కావాలంటూ హైకోర్టును కూడా ఆశ్రయించారు. తనకు ప్రతిపక్ష హోదా ఇచ్చేలా సభను ఆదేశించాలని న్యాయస్థానాన్ని కోరారు. జగన్ పిటిషన్ ఇప్పటికీ విచారణకు తీసుకోవాలా.. వద్దా అనే దశలోనే ఉంది. అయినా ప్రతిపక్ష హోదాపై ఆయన అసత్యాలు ప్రచారం చేస్తూనే ఉన్నారు. తప్పుడు ప్రచారానికి తెరదించేందుకు రూలింగ్ ఇవ్వాలని నిర్ణయించా. సభకు దూరంగా ఉంటున్న ఎమ్మెల్యేలు.. ప్రజలు తమను ఎందుకు గెలిపించారో ఆలోచించాలి. సభకు రాకుంటే తమ నియోజకవర్గ ప్రజల సమస్యలు ఎవరు లేవనెత్తుతారు? ఇవన్నీ గ్రహించి సభకు రావాలని వైకాపా సభ్యులను కోరుతున్నానని స్పీకర్ పేర్కొన్నారు.

## మిగులు జలాలపై కేంద్రానికి లేఖ రాయండి

- **చంద్రబాబుకు హరీష్ రావు సవాల్**





**సిద్దిపేట,వమార్చి05(రిపబ్లిక్ న్యూస్):** మిగులు జలాలే వాడుకుంటున్నామని అంటున్న చంద్రబాబు..దమ్ముంటే తెలంగాణ ప్రాజెక్టులపై అభ్యంతరం లేదని చెప్పాలని ఎపి సీఎం చంద్రబాబుకు మాజీ మంత్రి హరీష్ రావు సవాల్ విసిరారు. ‘మీకు నిజంగా తెలంగాణపై ప్రేమ ఉంటే సమ్మక్క సారక్క, సీతమ్మ సాగర్, వార్ధా ప్రాజెక్టు, కాళేశ్వరంలో మూడో ప్రాజెక్టుకి అనుమతులు ఇవ్వమని కేంద్రానికి చెప్పండి. లేఖ రాయండని సవాల్ చేశారు. అప్పుడు మేము మీకు నిజంగా తెలంగాణపై ప్రేమ ఉందని నమ్ముతాం. మీ రెండు కళ్ళ సిద్ధాంతం కరెక్ట్ అని చెబుతాం. కేంద్ర బడ్జెట్ లో మీ వాటా మీరు తీసుకున్నారు.. మరి తెలంగాణకి ఎందుకు ఇవ్వలేదని ఎందుకు ప్రశ్నించలేదు. మీకు తెలంగాణపై ప్రేమ లేదు.. మా హక్కుల కోసం ఏనాడు పోరాడలేదు. గోదావరిలో తెలంగాణకి 969 టీఎంసీల నీటిని కేటాయించారు. అవి మమ్మల్ని వాడుకొనివ్వండి.‘ అని హరీష్ రావు వ్యాఖ్యానించారు. మీరు మాట్లాడుతున్నదానికి మీ చేతలకు సంబంధం లేదని సీఎం చంద్రబాబును హరీష్ రావు విమర్శించారు. వైజాగ్ ఉక్కు పరిశ్రమలాగా మా ఆదిలాబాద్ సిమెంట్ ఫ్యాక్టరీని కాపాడాలని సూచించారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చినట్టు పాలమూరు ప్రాజెక్టుకి జాతీయ హోదా అడగాలన్నారు. ఇక్కడ ఉన్న ఎంపీలు పార్లమెంట్లో మౌనం వహిస్తున్నారని.. ఇంత జరుగుతున్న సీఎం రేవంత్ ఎందుకు మౌనంగా ఉంటున్నారని విమర్శలు గుప్పించారు. 8మంది ఎంపిలున్న బిజెపి మాట్లాడదు..కాంగ్రెస్ ఎంపిలు నిలదీయడం లేదని మండిపడ్డారు.

## అహంకారానికి నిలువెత్తు రూపం జగన్

(మొదటి పేజీ తరువాయి)

దూరంగానే ఉన్నారని మండిపడ్డారు. పరదాల ప్రభుత్వం పోయాక రాష్ట్రంలో పరదాల అమ్మకాలు తగ్గాయని వ్యాఖ్యానించారు.‘వైకాపాకు ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వకూడదని నిర్ణయించారు. ఆ విషయం జగన్‌కు ఎందుకు అర్థం కావట్లేదు? ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదా గురించి సీఎంను కించపరిచేలా మాట్లాడుతారా? ప్రతిపక్ష హోదా రావాలంటే 10శాతం సభ్యులుండాలి. 11 సీట్లు ఎందుకు వచ్చాయో ఆత్మ పరిశీలన చేసుకుంటే మంచిది. తల్లి, చెల్లి కూడా నమ్మట్లేదని జగన్ ఇంకా గ్రహించట్లేదు. పవన్ కల్యాణ్‌కు వచ్చిన మెజారిటీ ఎంత? జగన్‌కు వచ్చింది ఎంత? సీఎం, డిప్యూటీ సీఎంపై జగన్‌వి దిగజారుడు మాటలు మానుకోవాలన్నారు. గతంలో లేని విధంగా రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరుగుతుందని ఎన్నికల ముందు చెప్పారు. ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకున్నాం. గత ప్రభుత్వం విధ్వంసం వల్ల ఆదాయం పడిపోయింది. గాడి తప్పిన రాష్ట్రాన్ని సరైన మార్గంలో పెడుతున్నాం‘ అని లోకేశ్ వివరించారు.‘జగన్‌కు చట్టాలు ఉల్లంఘించటం అలవాటు కాబట్టి.. మేము కూడా చట్టాన్ని ఉల్లంఘించి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని అంటున్నారు. ఎమ్మెల్యేగా గెలవకుండా సభకు వస్తా అన్నట్టుగా జగన్ వితండ వాదం ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి మెజారిటీకి భయపడి హడావుడిగా బెంగళూరు నుంచి వచ్చి ప్రెస్‌మీట్ పెట్టి .. మళ్లీ బెంగళూరురు తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు. జగన్ 40లక్షల ఉద్యోగాలు ఎవరికి కల్పించారు, ఎక్కడ ఇచ్చారో సమాధానం చెప్పాలి. 40లక్షల ఉద్యోగాల కల్పన జరిగి ఉంటే ఇక నిరుద్యోగ సమస్య ఎక్కడుంటుందని లోకేశ్ ప్రశ్నించారు. జగన్ చేసిన విధ్వంసం వల్ల పడిపోయిన రాష్ట్ర ఆదాయాన్ని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నాం. సజ్జల స్క్రిప్ట్ పంపిస్తుంటే మండలిలో అది చదవటం తప్ప బొత్స చేతుల్లో ఏముంది. మూడు రాజధానులపై జగన్ స్టాండ్ ఏంటో బొత్స ఏం చెప్పగలరా అని ఆక్షేపించారు.

## పిపిపి మోడల్‌లో 10 మెడికల్ కాలేజీల నిర్మాణం

- **మండలిలో వైకాసా సభ్యుల ప్రశ్నలకు మంత్రి సమాధానం**

**అమరావతి,మార్చి05(రిపబ్లిక్ న్యూస్)** రాష్ట్రంలో 10 మెడికల్ కాలేజీలను పీపీపీ పద్ధతిలో నిర్మాణం చేస్తున్నామని మంత్రి సత్య కుమార్ తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో 17 కొత్త మెడికల్ కాలేజీలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కాలేజీల నిర్మాణంపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. కేవలం 15 శాతం పనులు మాత్రమే గత ఐదేళ్లలో పూర్తి చేశారని అన్నారు. ఏపీలో మెడికల్ కాలేజీలపై శాసనమండలిలో చర్చ జరిగింది. మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం చేస్తున్నారా అంటూ వైసీపీ సభ్యులు ప్రశ్నించారు. వైసీపీ సభ్యుల ప్రశ్నలకు వైద్య శాఖ మంత్రి సత్య కుమార్ సమాధానం చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్మాణాల గురించి పట్టించుకోని నేతలు ఇప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఒక్క పులివెందుల కాలేజికి మాత్రం 59 శాతం నిధులు ఖర్చు చేశారన్నారు. టెండర్‌లే పిలవని పార్వతిపురం కాలేజీని అద్భుతంగా కట్టామని అప్పటి డిప్యూటీ సీఎం చెప్పడం హాస్యస్పదంగా ఉందని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం మెడికల్ విద్యను పేద వాడికి దూరం చేసిందని మంత్రి సత్య కుమార్ విమర్శించారు.

## తల్లికి వందనానికి త్వరలో మార్గదర్శకాలు: లోకేశ్



**అమరావతిమార్చి05(రిపబ్లిక్ న్యూస్)** ’తల్లికి వందనం’ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెడుతోందని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. ‘తల్లికి వందనం’ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే ఇస్తాం. బడ్జెట్‌లో రూ.9407 కోట్లు ఈ పథకానికి కేటాయించాం. గత ప్రభుత్వంలో దీనికి ఏడాదికి రూ.5,540 కోట్లు కేటాయించారు, గతంతో పోలిస్తే ఇది 50శాతం అధికం. ఎన్నికలకు ముందు సూపర్-6 అనే కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ’తల్లికి వందనం’ పథకాన్ని చంద్రబాబు ప్రకటించారు. మే నెలలో తప్పనిసరిగా ఇంటిలో ఎంతమంది చదువుకునే బిడ్డలుంటే అంతమందికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తాం‘ అని లోకేశ్ తెలిపారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం RNI No.:2023/87888
గురువారం 6 మార్చి 2025

# కర్నూలు స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ 80 శాతం వైద్య సేవలు









కర్నూలు ప్రతినిధి మార్చి 0 5 (రిపబ్లిక్ న్యూస్): స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్లో 80 శాతం వైద్య సేవలు అందుబాటులోకి.కర్నూల్ నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల యందు నెలకొల్పిన "స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్" యందు 80 శాతం వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ %ఁ% మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె . చిట్టి నరసమ్మ , క్యాన్సర్ ఇనిస్ట్యూట్ డైరెక్టర్ కె. ప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాన్సర్ చికిత్సకు ఉపయోగించే అత్యాధునిక పరికరం "లీనాక్ మిషన్" కూడా ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే ఓపి సేవలు, ఇన్ పేషెంట్ సేవలు అందుబాటులోకి వచ్చాయని, మరికొన్ని ఆపరేషన్ థియేటర్ పరికరాలు రావాల్సి ఉందని అవి వచ్చిన వెంటనే త్వరలో ఆపరేషన్ థియేటర్ సేవలు కూడా ప్రజలకు అందుబాటులోకి తెస్తామని వారు తెలిపారు.

# స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు జరపాలి

**అన్ని పంటలకు మద్దతు ధర ఇవ్వాలి.**

**స్మార్ట్ మీటర్స్ బిగించడం మానుకోవాలి.**

**పత్తి పంటకు 10000 మిర్చికి 25000 క్వింటాలకు ఇవ్వాలి.**

**సాగునీటి ప్రాజెక్టులకు తక్షణమే నిధులు కేటాయించాలి.**

**అఖిలపక్ష రైతు సంఘాల డిమాండ్.**

**స్వామినాథన్ కమిషన్ సుబ్బరసులు తక్షణమే అమలు జరపాలి అఖిలపక్ష రైతు సంఘాల డిమాండ్**




**కర్నూలు ప్రతి నిధి మార్చి0 5 (రిపబ్లిక్ న్యూస్)** అఖిలపక్ష రైతు సంఘాల పిలుపుమేరకు ఈరోజు సుందరయ్య సర్కిల్ ల్లో ధర్నా జరిగినది ఈ కార్యక్రమానికి ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కే వెంకటేశులు అధ్యక్షత వహించారు ఈ కార్యక్రమానికి ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి రామకృష్ణ ఏఐకేఎంఎస్ నాయకులు వెంకటస్వామి సిఐటియు జిల్లా కార్యదర్శి అంజిబాబు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లింగన్న, మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అరుణ ,అలివేలమ్మ గారలు హాజరై మాట్లాడారు ఈ సందర్భంగా మాట్లాడుతూ 2012వ సంవత్సరం నుండి ఇప్పటివరకు లక్ష మంది పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు మద్దతు ధర చట్టాన్ని అమలు చేస్తామని చెప్పిన ఎన్డీఏ ప్రభుత్వం చేయలేక సుప్రీంకోర్టులో అటవీటి దాతలు చేయడం రైతులను దగా చేయడమేనని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు స్మార్ట్ మీటర్లు పెట్టడం వలన రైతులకు మరింత భారం అవుతుందని అనేక సంఘాలు తమ వ్యతిరేకతను నిరసనను అసమ్మతిని తెలియజేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం బలవంతంగా రాష్ట్రాల పైన రుద్ది రైతులకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రయత్నం చేయడం శోచనీయమని వారన్నారు రైతాంగానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఏమాత్రం ఆశాజనకంగా లేదని వారు తెలిపారు. కర్నూలు జిల్లాలో వేదవతి ప్రాజెక్టు గుండ్రేవుల రిజర్వాయర్ ఆర్డీఎస్ కుడి కాలువలు నిర్మాణం చేసినట్లయితే కరువును శాశ్వతంగా పారద్రోలడానికి అవకాశం ఉంది కానీ నిన్న ఆర్థిక మంత్రి అయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఈ మొత్తం సాగునీటి ప్రాజెక్టులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదంటే ఇది రైతు ప్రభుత్వమా రైతు వ్యతిరేక ప్రభుత్వమా అని వారు ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతుల ఖాతాలో 20000 జమ చేస్తామని చెప్పి ఎన్నికల్లో ఓట్లు దండుకొని ఇప్పటివరకు పైసా కూడా ఇవ్వకపోవడం ఇది మోస కార్యక్రమం తప్ప




మరొకటి కాదని వారు ధ్వజమెత్తారు ఇప్పటికైనా రైతు వ్యతిరేక విధానాలు విడనాడి నూటికి 65 మంది వ్యవసాయం పైన ఆధారపడి జీవిస్తున్నారు అటువంటి రంగాన్ని కాపాడాల్సిన అవసరం ప్రభుత్వాలపైన ఉందని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఏ కృష్ణ జిల్లా నాయకులు భాషా, రైతు స్వరాజ్య వేదిక నాయకులు పో తుల శేఖర్, రైతు కూలీ సంఘం నాయకులు కాజా, రాజు, మహిళా సంఘం నాయకులు సుజాత , తదితరులు పాల్గొన్నారు

# కేసీ ఆయకట్టు సాగులో ఉన్న పంటలను కాపాడుతాం

**జల వనరుల శాఖ మంత్రి నిమ్మల,**

**ముఖ్య కార్యదర్శి సాయి ప్రసాద్ తో మంత్రి ఫరూక్ భేటీ**

**కేసీ రైతుల సమస్యను వివరించిన మంత్రి ఫరూక్**



అమరావతి మార్చి5 (రిపబ్లిక్ న్యూస్) : ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు- కడప కెనాల్ ఆయకట్టు కింద సాగు చేసిన పంటలను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపడతామని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు.ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో రబీ సీజన్ లో వివిధ రకాల పంటలను రైతుల సాగు చేశారు. ఈ పంటలన్నీ ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్నాయి.అయితే కేసీ కెనాల్ కు సాగునీటి విడుదలను అధికార యంత్రాంగం నిలిపివేసింది. దీంతో పంటలు సాగు చేసిన రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్న విషయాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు,జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి సాయి ప్రసాద్, కార్యదర్శి రామసుందర్ రెడ్డి, ఈఎన్ సి వెంకటేశ్వరరావు లకు రాష్ట్ర న్యాయ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వివరించారు. బుధవారం మంత్రి నిమ్మల రామానాయుడు క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. రైతుల పరిస్థితిని సమగ్రంగా మంత్రి ఫరూక్ వివరించారు. ఈ విషయంపై మంత్రి నిమ్మల రామానాయుడు, ముఖ్య కార్యదర్శి సాయి ప్రసాద్ లు ఉమ్మడి కర్నూలు జిల్లా జలవనరుల శాఖ అధికారులతో కేసీ ఆయకట్టు లో పంటల పరిస్థితి,నెలకొన్న పరిస్థితులపై మాట్లాడారు. కేసీ కింద ఆయకట్టు లో పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మంత్రి ఫరూక్ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కేసీ కెనాల్ ఆయకట్టులో సాగుచేసిన రైతులు ఆందోళన చేద్దాల్సిన అవసరం లేదని, పంటలను కాపాడేందుకు అన్నీ చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి ఫరూక్ వెల్లడించారు.

# పారిశ్రామిక వర్గాల్లో తమ ప్రభుత్వం ఒక విశ్వాసాన్ని కలిగించింది.

## మంత్రి టి.జి భరత్

కర్నూలు ప్రతినిధి మార్చి 0 5 (రిపబ్లిక్ న్యూస్) ఆరు నెలల క్రితం పారిశ్రామిక వేత్తలు తమను కలిసినప్పుడు 1947లో స్వాతంత్ర్య%శీ% చూసామో లేదో కానీ, ఈ ప్రభుత్వం వచ్చాకే నిజమైన స్వాతంత్ర్య%శీ% చూసామని చెప్పారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ అన్నారు. అసెంబ్లీలో మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే మాట్లాడే దానికి కానీ లేదా ఏదైనా విషయం అడగడానికి కానీ వీలు కలిగిందని పారిశ్రామికవేత్తలు చెప్పారని మంత్రి తెలిపారు. మంత్రి టి.జి.భరత్ మాట్లాడుతూ పారిస్ లో చాంబర్ ఆఫ్ కామర్స్ లో ఇండియాలో ఎక్కడైనా పరిశ్రమలు పెట్టండి కానీ ఆంధ్రప్రదేశ్లో మాత్రం పరిశ్రమలు పెట్టకండని మాట్లాడే దుస్థితికి గత పాలకులు తెచ్చారన్నారు. గత ఎనిమిది నెలల్లో పారిశ్రామిక వర్గాల్లో తమ ప్రభుత్వం ఒక విశ్వాసాన్ని కలిగించిందన్నారు. సుమారు 6.50 లక్షల కోట్ల రూపాయలు నిజమైన పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారన్నారు. లక్షల ఉద్యోగ అవకాశాలు కూడా ఏర్పడతాయన్నారు. చాలా మంది సభ్యులు పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించాలని, పరిశ్రమలు తెప్పించాలని కోరుతున్నారన్నారు. సభ్యులు విజయ్ కుమార్ రాజు, యార్లగడ్డ వెంకట్రావు, కృష్ణ చైతన్య, ఈశ్వరరావు చెప్పిన అంశాలను తాను, తమ ప్రిన్సిపల్ సెక్రెటరీ



నోట్ చేసుకున్నామని.. దాన్ని పారిశ్రామికవేత్తలతోనూ, మా సమీక్షలలో కచ్చితంగా చర్చించి ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటామని మంత్రి టి.జి భరత్ చెప్పారు. అంతకుముందు శాసన మండలిలో ఆయన మాట్లాడారు. ముందుగా ఎమ్మెల్సీ వంకా రవీంద్ర నాథ్ అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. కేంద్ర ప్రభుత్వ మౌలిక సదుపాయాల అభివృద్ధి గ్రాంటు క్రింద రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ను విడుదల చేయకపోవడం వల్ల పెండింగ్ లో ఉన్న కొనసాగుతున్న పనుల వివరాలు ఏంటని ఎమ్మెల్సీ వంకా రవీంద్ర నాథ్ అడిగారు. అలాంటివి ఏమీలేవని మంత్రి తెలిపారు. దీంతో పాటు పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు (టెట్లీ) ఇండస్ట్రియల్ ఎస్టేట్ పనులు మధ్యలో నిలిచిపోయాయా అని అడగ్గా.. మొత్తం ప్రాజెక్ట్ వ్యయం రూ.10.10 కోట్ల (కేంద్ర ప్రభుత్వం వాటా 8 కోట్లు మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం / ఎ.పి.ఐ.ఐ.సి వాటా రూ.2.10 కోట్లు) ఎంఎస్ఇ-సిడిపి కేంద్ర ప్రభుత్వ పథకం క్రింద ఎపిఐఐసి ద్వారా పశ్చిమ గోదావరిలో టేట్లే, తణుకు వద్ద ఇండస్ట్రియల్ ఎస్టేట్ పనిని చేపట్టడమయిందని మంత్రి తెలిపారు. మొదట ఎపిఐఐసి వాటా (మొదటి వాయిదా) నుండి రూ.1.5 కోట్ల మొత్తాన్ని డిపాజిట్ చేయడమయింది. నిధులు అయిపోయే వరకు ఏజెన్సీకి చెల్లింపులు చేయడమయింది. ఆ ఏజెన్సీ వెంటనే పనిని తాత్కాలికంగా ఆపివేసింది. 21-01-2025 తేదీన ఎపిఐఐసికి రూ.2.00 కోట్ల మొదటి వాయిదా సహాయక గ్రాంటును కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ తేదీ వరకు బిల్లులను ఏజెన్సీలకు ఎపిఐఐసి చెల్లింపులను విడుదల చేయడమయింది. అప్పటినుండి ఏజెన్సీ తిరిగి పనులను ప్రారంభించిందని మంత్రి టి.జి భరత్ చెప్పారు. ఇప్పటివరకు పనికోసం చేసిన వ్యయం రూ.3.17 కోట్లు (వినియోగించిన కేంద్ర ప్రభుత్వ వాటా రూ.1.24 కోట్లు మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం / ఎపిఐఐసి వినియోగించిన వాటా రూ..1.93 కోట్లు) అని, ఏజెన్సీ పనిని ప్రారంభించింది, మిగిలిన పెండింగ్ పనులు జరుగుతున్నాయని టి.జి భరత్ సమాధానమిచ్చారు. పెట్టుబడిదారులకు భూముల కేటాయింపు విషయంలో ప్రభుత్వం తరుపున పూర్తి సహకారం ఉందన్నారు. ఇప్పటికే ఉన్న కంపెనీలకు సైతం ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకొని పరిష్కరించే విధంగా తాము ముందుకు వెళుతున్నట్లు మంత్రి టి.జి భరత్ పేర్కొన్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

# ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నంద్యాల జిల్లా ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు

**-నంద్యాల జిల్లా అధ్యక్షులు కె.నాగేంద్రప్ప.**



నంద్యాల మార్చి 5 (రిపబ్లిక్ న్యూస్) :అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గురు రాజ పాఠశాల క్రీడా మైదానంలో మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను శ్రీ గురు రాజా విద్యా సంస్థల డైరెక్టర్ షేక్షవలి రెడ్డి ప్రారంభించారు. వివిధ శాఖలలో పని చేస్తున్న ఉద్యోగినులు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్రప్ప మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సంఘం ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగుల కొరకు ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుంది అని, పోటీలలో గెలుపొందిన వారికి జిల్లా సంఘం కార్యాలయంలో శనివారం రోజు అనగా మార్చి నెల 8వ తేదీన మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటుగా పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని, అదే రోజు సాంస్కృతిక కార్యక్రమాలతో అంతర్జాతీయ మహిళా దినోత్సం ఘనంగా నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ శనివారం కార్యక్రమానికి హాజరై జయప్రదం చేయవలసినదిగా కోరడం జరిగినది. ఈ కార్యక్రమములో జిల్లా కార్యదర్శి యస్. తిరుపాలయ్యా, జిల్లా సహ అధ్యక్షులు శ్రీహరి, జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, జిలా ఉపాధ్యక్షులు ఫక్రుద్దిన్, విజయలక్ష్మి, సిటీ అధ్యక్షులు సత్యం, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆర్.ప్రభావతమ్మ, మరియు ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజా చైతన్య యాత్రలను జయప్రదం చేయండి

**ప్రజా సమస్యలు పట్టని పాలకులు**

**కాషాయ, కార్పొరేటు విధానాలతో**

**దేశానికి ముప్పు**

**రాజ్యాంగ వ్యవస్థలపై కేంద్ర ప్రభుత్వ దాడి**

**సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్**







కర్నూలు ప్రతినిధి మార్చి 05 (రిపబ్లిక్ న్యూస్ ) సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ అన్నారు. బుధవారం నగరంలోని కార్మిక కర్షక భవన్ నందు సిపిఎం జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి అంజిబాబు అధ్యక్షతన జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి రామకృష్ణ, కె.వి నారాయణ తో కలిసి జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ... రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా దేశంలో బిజెపి మతోన్మాద అజెండాను అమలు చేస్తోందన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకొనేది ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోందన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే పాలన పేరుతో లౌకిక భావనకు తూట్లు పొడుస్తోందన్నారు. రాష్ట్రాల హక్కులను, నిధులను కాజేస్తోందన్నారు. మతోన్మాద కార్పొరేటు శక్తులు జతకట్టి దేశాన్ని దోచేస్తున్నాయన్నారు. 2014లో దేశంలో శతకోటీశ్వరుల సంఖ్య 100 మంది కాగా నేడు ఆ సంఖ్య 200 కు చేరిందన్నారు. రూ.1.46 వేల కోట్లు కార్పొరేట్ సంస్థల అప్పులను ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కోడ్లను ప్రవేశపెట్టి కార్మికుల హక్కులను కాల రాసిందన్నారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించి రైతుల గొంతుకు ఉరిబిగించిందన్నారు. ఎమ్మెస్ స్వామినాథన్ సేవలను గౌరవిస్తారు కానీ, ఆయన ప్రతిపాదించిన సూచనలను పాలకులు ఏమాత్రం గౌరవించకపోవడం శోచనీయమన్నారు. రైతులకు వ్యవసాయ పెట్టుబడి సహకారం అందించడంలో, గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయకపోవడం వల్ల సంక్షోభం విస్తరిస్తోందన్నారు. ప్రధానమంత్రి నిరుద్యోగులకు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ అటకెక్కిందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు రాష్ట్రంలోని అధికార ప్రతిపక్ష పార్టీలు వంత పడుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం విస్మరించిందన్నారు. ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు విడుదల చేయకపోవడం వల్ల పేదలు గ్రామాలను వదిలి పురుగు వలసలు వెళ్లాల్సిన దౌర్భాగ్య పరిస్థితి జిల్లాలో ఉందన్నారు. నిరుపేదలకు తలదాచుకునేందుకు కనీస గూడు కరువైందన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు తో పాటు ఉచితంగా ఇల్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నీటి రాతలుగానే మిగిలాయన్నారు. జిల్లాలో పెండింగ్లో ఉన్న వివిధ సాగు తాగునీటి ప్రాజెక్టుల పరిస్థితి ఎక్కడ వేసినా గొంగడి అక్కడే అన్న చందంగా తయారయింది అన్నారు. నిత్యవసర ధరలు కొండెక్కి కూర్చున్నాయని, సామాన్యుడు పూట గడవడం కష్టసాధ్యమైందన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు ఎండగట్టేలా ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లి ప్రజలను చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ... జిల్లాలో వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో స్థానికంగా తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, ఎక్కడికక్కడ సమస్యలను గుర్తించి ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. రైతులు కార్మికుల సమస్యలను గుర్తించి, పరిష్కార దిశగా పోరాటాలు నిర్వహించాలని అన్నారు. పార్టీ ప్రజా పునాదిని పెంచుకో వేయడానికి కృషి చేయాలన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**- జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్.**

**జిల్లాలోని రోడ్డు ప్రమాదాలు జరిగే హాట్ స్పాట్స్ గుర్తింపు.**

**ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలలో నివారణ చర్యలు చేపట్టాలి.**

**రంబుల్ స్ట్రిప్స్, సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, స్పీడ్ లేజర్ గన్ ఏర్పాటు మరియు డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలి.**

**రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేక కార్యచరణ.**

**జిల్లా పోలీసు అధికారులతో రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు.**






**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో మార్చి 05 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-** రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించడానికి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యచరణను అవలంబించనున్నట్లు జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్ తెలిపారు. ఈరోజు స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయం నందు జిల్లా పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి వివిధ రకాల చర్యలను చేపడుతూ ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదలు జరుగుతున్న ప్రాంతాలైన హాట్స్పాట్లను గుర్తించి ఆ ప్రదేశాలలో సూచిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్ లాంటివి ఏర్పాటు చేయాలని స్పీడ్ లేజర్ గన్ను వినియోగిస్తూ ఎక్కువగా వేగంగా నడుపు వాహనాలపై తగు చర్యలను తీసుకోవాలని సూచించారు. ప్రమాదాల ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాలు ఉండటంతో ప్రత్యేకంగా గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ రోడ్డుకు ఎడమవైపుని వాహనాలు నడపాలని, కుడివైపున నడపడం వల్ల ప్రమాదాలకు కారణమవుతాయనే విషయాన్ని ప్రత్యేకంగా తెలియజేయాలన్నారు. ఎలాంటి ఇంజనీరింగ్ సమస్యల వల్ల ప్రమాదాలు జరుగుతున్నట్లయితే వాటిని తెలియజేయాలని సూచించారు. సాయంత్రం సమయంలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు నిర్వహిస్తూ ఉండాలని తెలిపారు. రాంగ్ రూట్లో వెళ్లేవారు పై ఇ చలాన్స్ బెదిరిస్తూ రాంగ్ రూట్ ప్రయాణాలను నివారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి పోతారం శ్రీనివాస్, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ పాండే రావు, జిల్లా పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# మహిళల కు ప్రత్యేకంగా అవగాహన

**- సైబర్ డిఎస్పి హసీబుల్లా**

**పట్టణంలోని పలు కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమం**

**మార్చి 5 మహిళా సైబర్ జాగృతి దినోత్సవం.**

**సైబర్ బానిసత్వం, డిజిటల్ అరెస్ట్, ఉద్యోగ మోసాల పై విద్యార్థినులకు అవగాహన.**









**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో మార్చి 05 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**
మార్చి 5 మహిళా సైబర్ జాగృతి దినోత్సవ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు డిఎస్పి హసీబుల్లా ఆధ్వర్యంలో ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైబర్ జాగృతి దివాస్ నిర్వహించారు, సైబర్ బానిసత్వం, డిజిటల్ అరెస్ట్, ఉద్యోగ మోసాలు మరియు వేధింపులు అనే అంశాలపై మహిళలు మరియు బాలిక విద్యార్థులపై దృష్టి సారించి, ఆదిలాబాద్‌లో జరుగుతున్న వివిధ సైబర్ నేరాల గురించి వివరంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డిఎస్పి హసీబుల్లా, ఆదిలాబాద్ సిఐ శ్రీ సునీల్ మరియు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి అతీకా బేగం మరియు ఐటి కోర్ రియాజ్, షీ టీం %ూూా×% సునీత, తదితరులు పాల్గొన్నారు.

## యువ శాస్త్రవేత్తలను తయారు చేయడానికి

# ఇస్రో పిలుస్తోంది..వెళ్దాం రండి విద్యార్థులారా

**-దేశవ్యాప్తంగా ఉన్న తొమ్మిదో తరగతి విద్యార్థులు ఇస్రో కేంద్రాల సందర్శనకు దరఖాస్తులు చేసుకోండి**

**:-డాక్టర్ టేకూరి. నాగేశ్వరరావు(సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు)**

పాములపాడు మార్చి 5 (రిపబ్లిక్ న్యూస్):- పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామానికి చెందిన అంతర్జాతీయ సమాజసేవకుడు %డ% సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరావు దేశవ్యాప్తంగా 9వ తరగతి చదివే విద్యార్థులు ఇస్రో కేంద్రాల సందర్శనకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ హ్యూమన్ రైట్స్ అవార్డు గ్రహీత %డ% సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు డాక్టర్ టేకూరి.నాగేశ్వరావు మాట్లాడుతూ అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఏటా యువ విజ్ఞాన కార్యక్రమం(యువికా) నిర్వహిస్తోందన్నారు. ఈ ఏడాది చేపట్టబోయే కార్యక్రమం కోసం దేశవ్యాప్తంగా తొమ్మిదో తరగతి విద్యార్థులను ఆహ్వానిస్తోంది. ఆ సంగతులేంటో తెలుసుకుందాం రండి అన్నారు.

అంతరిక్ష పరిశోధనల్లో ఇటీవల ఇస్రో వంద ప్రయోగాలు పూర్తి చేసుకుందన్నారు. అగ్రదేశాలకు దీటుగా మన భారతదేశం అనేక పరిశోధనలు చేపడుతోందని అన్నారు. ఈ విజ్ఞానాన్ని విద్యార్థులకు తెలియజెప్పేందుకు, వారిలో స్ఫూర్తి నింపేందుకు ఇస్రో ఈ కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు.




**విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి మార్చి-23 వరకు గడువు**

విద్యార్థులు మార్చి-23వ తేదీలోగా www.isro.gov.in లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. వచ్చిన దరఖాస్తుల వడపోత అనంతరం ఏప్రిల్- 7 వ తేదీన ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల చేస్తారన్నారు. మే-18వ తేదీ నుంచి విద్యార్థులను ఆహ్వానిస్తారన్నారు. మే- 19 వ తేదీ నుంచి 30 వరకు యువికా-25 కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. మే- 31వ తేదీన ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తారని తెలియజేశారు.

**దేశవ్యాప్తంగా ఉన్న ఇస్రో 7 కేంద్రాల్లో నిర్వహణ**

ఇస్రో ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో చేపడుతోందన్నారు.ఇవి డెహ్రాడూన్ (ఉత్తరాఖండ్), తిరువనంతపురం (కేరళ), సూళ్లూరుపేట (ఏపీ), బెంగళూరు (కర్ణాటక), అహ్మదాబాద్ (గుజరాత్), హైదరాబాద్ (తెలంగాణ), షిల్లాంగ్ (మేఘాలయ) రాష్ట్రాలలో ఉన్నాయన్నారు.

అక్కడికి వెళ్లడానికి అన్నీ ఉచితంగానే

ఇస్రో నిర్వహించే యువికా కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులకు ప్రయాణం, భోజన, వసతి సౌకర్యాలను ఇస్రో ఉచితంగా అందజేస్తుందన్నారు. ఎంపికైన విద్యార్థులను మే నెలలో 14 రోజులపాటు ఇస్రోకు చెందిన స్పేస్ సెంటర్లకు తీసుకెళ్తారన్నారు. అక్కడ సైన్స్‌కు సంబంధించిన వింతలు, విశేషాలు, సప్తగ్రహ కూటమి తదితర అంశాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారన్నారు. శాస్త్రవేత్తలతో మాట్లాడే అవకాశం విద్యార్థులకు కల్పిస్తారన్నారు.

**ఎవరు అర్హులు అంటే**

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. 8వ తరగతిలో సాధించిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇస్తారన్నారు. స్పేస్, సైన్సు క్లబ్‌లలో ఉంటే 5 శాతం, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపితే 10 శాతం, ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాల్లో ఉంటే 5 శాతం, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి 20 శాతం ప్రాధాన్యం ఇస్తారన్నారు.

# వడదెబ్బ లక్షణాలు ప్రథమ చికిత్స పై అవగాహన

పత్తికొండ: ప్రతినిధి మార్చి0 5 (రిపబ్లిక్ న్యూస్)
పత్తికొండ కో లోకేటెడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆరోగ్య ఆయుష్ మందిర్ లో జరుగుచున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని జిల్లా నోడల్ ఆఫీసర్ డా థ్కర్. రఘు తనిఖీ చేశారు, అనంతరం మాట్లాడుతూ వడ దెబ్బ లక్షణాలు %-% మరియు ప్రథమ చికిత్స గురించి అవగాహనా కల్పించాలని వైదధికారి కి సూచంచినారు. ఎండలు తీవ్రముగా ఉన్నప్పుడు మనిషి శరీరములో ఉష్ణోగ్రతను నియంత్రించే కేంద్ర మం డల నాడి వ్యవస్థ దెబ్బ తినడం వలన వడదెబ్బ వస్తుంది. శరీర ఉష్ణోగ్రత పెరిగి మెదడు మీద ప్రభావం చూపుతుంది. వడదెబ్బ తగిలిన వారిలో 40% మరణాలు సంభవిస్తాయి. ఇది చాల ప్రమాదకరమైనది.వేసవి కాలములో సాధారణ%శీ%గా అపాయానికి గురి చేసేది వడదెబ్బ దానినే సన్ స్ట్రోక్ లేదా హీట్ స్ట్రోక్ అంటారు. తీవ్ర స్థాయిలో వడదెబ్బ తగిలితే ప్రాణాలు పోయే ప్రమాదము కూడా ఉంది. కనుక వడ దెబ్బ తగిలిన వ్యక్తికి తక్షణమే వైద్య సహాయం అందించాలి.



**లక్షణాలు :-** 1.తలనొప్పి 2.తలతిరగడము 3.నాలిక ఎండి పోవడము/ పిడచ కట్టుకుపోవడము /చెమట పట్టుకుండుట. 4.ఎండి పోయిన చర్మముతో ఎక్కువ జ్వరం కలిగి ఉండడం 5. మగత కలవరింతలు 6. ఫిట్స్ 7. పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితి.

**కారణాలు :** 1. శరీరంలో ఎక్కువ వేడి ఉత్పత్తి కావడం 2. శరీరం ఎక్కువ ఉష్ణాన్ని కోల్పోవడము.చేయవలసిన పనులు :- 1.వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ గల ప్రదేశానికి చేర్చాలి. 2. అతని శరీరం పై వుండే దుస్తులను తొలగించి చల్లని నీటితో కడగడము కానీ, చల్లని నీటిలో ముంచిన గుడ్డతో తుడవడము చేయాలి. 3.ఐస్ ముక్కలను గుడ్డతో ఉంచి శరీరాన్నితుడిచి, చల్లని గాలి తగిలేలా చూడాలి. 4.రోగగ్రస్తులకు చల్లని నీరు లేదా ఉప్పు మరియు ఇతర లవణాలు కలిపిన నీటిని త్రాగించాలి. ఓ.ఆర్. యస్ %-% ద్రావకాన్ని త్రాగించాలి.అయితే ఇవన్ని భాదితునికి డాక్టరుకి చూపించే లోగా చేయవలసిన చర్యలు. స్పృహ కోల్పోతే మాత్రము సమయం వృధా చేయకుండా వైద్య సహాయం అందే ఏర్పాటు చేయాలి.ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీలు.50 సంవత్సరముల వయస్సుపై బడినవారు తమ ప్రయాణాలలో ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్స్ వెంట తీసుకొనివెళ్ళాలి. వేడిమి ఎక్కువగా ఉన్నచోట ఎక్కువ శ్రమతో కూడిన పనిచేయడం ఉదా: హెూటల్స్ వంటగదుల్లో పనిచేసేవారు, కార్మికులు, రైతులు, నిర్మాణపనులు, ఇటుక బట్టీలలో పనిచేయువారు, రక్షకభటులు, రోడ్డుప్రక్కన వ్యాపారం చేయు చిరువ్యాపారులు మరియు ఎండలో ప్రయాణం చేసేవారు. గర్భిణీలు మరియు పాలిచ్చే తల్లులు, అప్పుడే పుట్టిన పిల్లలు, పసిపిల్లలు.ముఖ్యంగా రేకుల షెడ్డులో నివసించేవారు అధిక జాగ్రతలు తీసుకోవాలి. అనారోగ్యంతో బాధపడుతున్నవారు ఉదా: గుండెజబ్బులు, అధిక రక్తపోటు, మధుమేహము కలవారు.వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్త చర్యలుసాధ్యమైనంత వరకు మిట్ట మధ్యాహ్నం ఎండలో 12 గ. నుండి 4 గం. వరకు తిరగకుండా జాగ్రత్త వహించాలి.తప్పని సరిగా బయటకువెళ్ళ వలసిన పరిస్థితులలో ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఉప్పు కలిపిన పళ్ళ రసాలు త్రాగి బయలుదేరాలి.వేసవి కాలములో తెల్లని దుస్తులు ధరించాలి, నల్లని వస్త్రాలు ధరించకూడదు.ఆల్కాహాల్ సేవించడం వల్ల రక్తనాళాలు వ్యాకోచించి ఎక్కువ చెమట వచ్చేలా చేస్తాయి. అది విషమ పరిస్థితి కి దోహదం చేస్తుంది. కనుక ఆల్కహాల్ సేవించరాదు.ఇంటి గదులు ఉష్ణోగ్రతను తగ్గించడానికి కిటికీలకు తలుపులకు తెరలను వాడి వేడిని తగ్గించవచ్చును. ఫ్యాన్లు, ఎయిర్ కూలర్లు, ఎయిర్ కండిషనర్లు వాడాలి.వేడిగా ఉన్నపుడు ఎండలో గొడుగు లేకుండా తిరుగరాదు.తప్పనిసరి పరిస్థుతలలోమండుటెండలో బయటికి వెళ్ళాలంటే మంచి నీటి బాటిల్ ని వెంట తీసుకోని వెళ్ళాలి.వేసవికాలంలో బయటకు వెళ్ళే అవసరం ఉంటే ఉదయం/సాయంత్రం సమయాలలో వెళ్ళేలా ఏర్పాటు చేసుకోవాలి.తలకు తెల్లని టోపీ లేక రుమాలు లేకుండా ఎండలో తిరుగరాదు. వడదెబ్బకు గురి అయిన వారు కోలుకుంటున్న లక్షణాలు లేనిచో శీతల వాతావరణంలో దగ్గరలోని హాస్పిటల్ చేర్చటంలో ఏ మాత్రం ఆలస్యం చేయరాదు.ఈ కార్యక్రమంలో వైదధికారి సుజాత , వైద్య సిబ్బంది కరుణ, చముండే శ్వారి, ఆశా కార్యకర్తలు మరియు ప్రాజెక్షనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విమానాశ్రయ నిర్మాణానికి చొరవ తీసుకోవాలి

**ఆదివాసి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోవ దౌలత్ రావు మొకాశి డిమాండ్**



**ఆదిలాబాద్ జిల్లా బ్యూరో**
**మార్చి 05 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**
ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో గల విమానాశ్రయ స్థలంలో విమానాశ్రయ నిర్మాణానికి స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే చొరవ తీసుకుని నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇతర జిల్లాలలో తగిన సౌకర్యాలు లేకున్నప్పటికి అక్కడి ప్రజా ప్రతినిధుల చొరవతో విమానాశ్రయాల నిర్మాణానికి అడుగులు పడుతున్నాయని కాని ఇక్కడి ప్రజాప్రతినిధులు మాత్రం విమానాశ్రయ నిర్మాణం గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆయన వాపోయారు. విమానాశ్రయ నిర్మాణానికి అన్ని అర్హతలున్నప్పటికి ప్రజా ప్రతినిధుల పట్టింపు లేకపోవటం వలన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజల కల కలగానే మిగిలిపోతుందని అని ఆయన అన్నారు. ఆదిలాబాద్ విమానాశ్రయ నిర్మాణం వలన రవాణా సౌకర్యాలు మెరుగుపడి వాణిజ్య వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు ఇది ఎంతగానో ఉపయోగ కరంగా ఉంటుందని ఆయన అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీల ప్రకారం విమానాశ్రయ నిర్మాణానికి ప్రజా ప్రతినిధులు వెంటనే చొరవ తీసుకుని పనులు ప్రారంభించే విధంగా చూడాలని ఆయన డిమాండ్ చేశారు లేని ఎడల అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని దశల వారీ ఉద్యమాలకు పూను కుంటామని ఆయన తెలిపినారు.

## కర్నూలు మూడవ పట్టణ పోలీసు స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్

**మహిళల భద్రత పై ప్రత్యేక దృష్టి సారించాలి.**

**పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి.**





కర్నూలు ప్రతినిధి మార్చి0 5 రిపబ్లిక్ న్యూస్: కర్నూలు నగరంలోని కర్నూలు మూడవ పోలీసు స్టేషన్ ను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు.పోలీసు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు..పోలీసులకు తగిన సూచనలు, సలహాలు చేశారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు.సీజ్ చేసిన వాహనాలను త్వరగా డిస్పోజ్ చేయాలన్నారు. పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎవరైనా సమస్యల పట్ల పోలీసుస్టేష న్ ను ఆశ్రయించినప్పుడు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. జిల్లా ఎస్పీ వెంట కర్నూలు డిఎస్పీ జె. బాబు ప్ర సాద్ , కర్నూలు మూడవ పట్టణ పీఎస్ సిఐ శేషయ్య, ఎస్సై మన్మధ విజయ్ పాల్గొన్నారు

## దివ్యాంగులకు మోసపూరిత మాటలు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్న మోసగాళ్ల మాటలు ప్రలోభాలకు లోను గాకుండా జాగ్రత్తగా ఉండాలి



కర్నూలు ప్రతినిధి మార్చి 05( రిపబ్లిక్ న్యూస్)
కర్నూలు జిల్లా లోని దివ్యాంగులకు తెలియ పరుచునది 9642076467, 6364506562 మరియు 6300090356 సెల్ నెంబర్ల నుండి మీకు ప్రభుత్వం మూడు చక్రాల వాహనం (స్కూటీ) పంపిణికి సంబందించిన ఫోటోలను పంపుతూ మూడు చక్రాల వాహనం (స్కూటీ), ల్యాప్టాప్ మరియు ఇతర సహాయ పరికరములు మంజూరు అయినవని చెపుతూ, అందకు కొంత డబ్బులు ఫోన్పే ద్వారా చెల్లించ వలసి ఉంటుందని చెపుతూ జిల్లాలోని దివ్యాంగులను మోసం చేస్తున్నారు.కావునా ఈ సెల్ నెంబర్ల అనగా 9642076467, 6364506562,6300090356 మరియు ఏ ఇతర ఫోన్ నెంబర్ల నుండి వికాలంగుల కార్యాలయ సిబ్బంది ఫాతిమా మాటాలాడుతున్నాను అన్ని చెపుతూ దివ్యాంగులకు మోసపూరిత మాటలు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్న ఈ మోసగాల మాటలకు ప్రలోబాలకు లోనుగాకుండా జాగ్రతగా వుండాలని శ్రీమతి రైయిస్ ఫాతిమా, సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల మరియు వయో వృద్ధుల సంక్షేమశాఖ, కర్నూలు వారు దివ్యాంగులకు సూచించారు మరియు అటువంటి వాటిపై మీ దగ్గరలోని పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయవలసినదిగా తెలియజేశారు. కర్నూలు జిల్లాలోని దివ్యాంగులు సహాయ పరికరాల సమాచారం కొరకు ఈ కార్యాలయపు ఫోన్ నెం. 08518-277864ను సంప్రదించవలసినదిగా కోరడమైనది.రయిస్ ఫాతిమా)సహాయ సంచాలకులు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల మరియు వయో వృద్ధుల సంక్షేమశాఖ, కర్నూలు.

# స్వచ్ఛత గ్రీన్ లీఫ్ రేటింగ్ సిస్టంపై కలెక్టర్ సమావేశం

**పర్యాటకులకు స్వచ్ఛత, శుభ్రత కలిగిన సౌకర్యాలు కల్పించేందుకు స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ రేటింగ్ సిస్టం**

**జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**






కర్నూలు ప్రతినిధి మార్చి 05 (రిపబ్లిక్ న్యూస్)
కర్నూలు, పర్యాటకులకు స్వచ్ఛత, శుభ్రత కలిగిన సౌకర్యాలు కల్పించడం లక్ష్యంగా స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ రేటింగ్ ను ప్రకటించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు.బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ రేటింగ్ సిస్టం పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో పర్యాటకులకు సౌకర్యాలు కల్పిస్తున్న హౌటల్స్, రెస్టారెంట్లు, హౌమ్ స్టే లు, ధర్మశాలలు, లాడ్జి లకు స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ రేటింగ్ ను ప్రకటించడం జరుగుతుందన్నారు. ఘన వ్యర్థాల నిర్వహణ, మానవ వ్యర్థాల నిర్వహణ, మురుగు నీటి నిర్వహణ ల ఆధారంగా వీటికి రేటింగ్ ప్రకటిస్తారన్నారు..టాయిలెట్ సదుపాయాలు వాటి నాణ్యత ప్రమాణాలు, సురక్షిత పారిశుద్ధ్య సౌకర్యాలు, ఘన,ద్రవ వ్యర్థాల నిర్వాహణ, తడి పొడి చెత్త వేరు చేసే విధానం లాంటి ప్రక్రియలను పరిశీలించడం జరుగుతుందన్నారు. ఆతిథ్య రంగంలో పరిశుభ్రత పాటించడం, పారిశుధ్యం కోసం మెరుగైన పద్ధతులను అవలంబించడం ఈ సిస్టమ్ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు%ౌ% పర్యాటక ప్రదేశాలలో పరిశుభ్రత, పారిశుధ్యం ఉండేలా దృష్టి పెట్టాలని, హోటల్‌లు, రెస్టారెంట్లు మొదలైన వాటిలో పర్యావరణ అనుకూల ఉత్పత్తులు, సేవల వినియోగాన్ని ప్రోత్సహించాలని, పరిశుభ్రత గురించి పర్యాటకులకు అవగాహన కల్పించే విధంగా టూరిజం శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు..మున్సిపల్ కమిషనర్లు, డిపిఓ లు ఈ అంశానికి సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఆతిథ్య సంస్థల స్టేక్ హోల్డర్ లకు ఈ సిస్టమ్ గురించి జిల్లా, డివిజనల్ స్థాయిలో వర్క్ షాప్ కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ ఆర్డబ్ల్యూఎస్, టూరిజం, పంచాయతీ అధికారులను ఆదేశించారు డివిజనల్ స్థాయి కమిటీలు వారి పరిధిలో పర్యాటకులకు సౌకర్యాలు కల్పిస్తున్న ఆతిథ్య సంస్థలను పరిశీలించి నివేదికలను జిల్లా స్థాయి కమిటీ కి మార్చి 31 వ తేది లోపు నివేదికను పంపించాలని, వాటిని పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందని కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డివిజనల్ స్థాయి కమిటీ చైర్మన్ కు అయిన ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓ లను ఆదేశించారు.సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వర రావు, జిల్లా పర్యాటకశాఖ అధికారి విజయ, డిపిఓ భాస్కర్, ఏపీ టూరిజం కార్పొరేషన్ డిప్యూటీ మేనేజర్ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

## మద్దెల సతీష్, నాగ కీర్తనలకు ఘన సన్మానం.



వెలుగోడు మార్చి 5 రిపబ్లిక్ న్యూస్ వెలుగోడు మండల మాధవరం గ్రామానికి చెందిన మద్దెల సతీష్ గుంతకందల గ్రామానికి చెందిన నాగ కీర్తనలు సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శిక్షణ పూర్తి చేసుకొని ఎస్ఐ లు గా పోస్టింగ్ లో చేరాడు. ఈ సందర్భంగా వారు చదువుకున్న వెలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నాడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ హెగ్డే ఎస్ఐ విష్ణు సత్యనారాయణ పాఠశాల ఉపాధ్యాయులు వారిద్దరిని పూలమాలతో శాలువలు లతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయుడు సత్యనారాయణ హెడే ఎస్సై విష్ణు నారాయణ లు మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదల తో చదివినట్లయితే దేనినైనా సాధించవచ్చు అన్నారు.అందుకు వీరే ఉదాహరణ అన్నారు.అనంతరం నూతన సబ్ ఇన్స్పెక్టర్ లకు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

## కేసీ కెనాల్ ఆయకట్టుకు విఘాతం కల్పించవద్దు.

**ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నీటిని నిలుపుదల చేయవద్దు**

**ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**



నంద్యాల, మార్చి 5, రిపబ్లిక్ న్యూస్ ::
ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా నీటి విడుదల ఆపవద్దని, నీటి విడుదల ఆపితే కేసి కెనాల్ ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతారని, కేసి కెనాల్ ఆయకట్టు రైతుల పంటలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి వెంటనే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఆమె కోరారు. కర్నూలు - కడప జిల్లాల పరిధిలో కేసీ కెనాల్ ఆయకట్టు క్రింద రైతులు రభి సీజన్ లో సుమారు 90000 వేల ఎకరాలు పంట సాగుచేశారని, ఈ రబీ పంటలకు ఏప్రిల్ 30వ తేదీ వరకు నీరు అందించాల్సిన అవసరం ఉందని ఎంపీ శబరి అన్నారు. అయితే కృష్ణానదిలో నీటి ప్రవాహం తగ్గుతుందన్న కారణంతో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి కేసి కాలువలో నీటి విడుదలను ఆ పాలనుకోవడం సరికాదని, రబీ సీజన్ పంట చివరి దశకు వచ్చిందని నీటి నిలుపుదల చేయడం వల్ల సాగు చేసిన పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆమె వివరించారు. కేసి కెనాల్ ఆయకట్టు రైతుల కష్టాలు ప్రభుత్వం దృష్టికి తీసుకొని పోతాం అని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

# ఈనెల 8న జాతీయ లోక్ అదాలత్

**కర్నూలు జిల్లా న్యాయ సేవధికార సంస్థ కార్యదర్శి లీలా బి.వెంకట శేషాద్రి**

**ఉమ్మడి జిల్లాలో అన్ని న్యాయస్థానాల్లో జాతీయ లోక్ అదాలత్**








కర్నూలు ప్రతినిధి మార్చి 05(రిపబ్లిక్ న్యూస్)
కర్నూలు జిల్లాలో ఈ నెల 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కర్నూలు జిల్లా న్యాయ సేవధికారి సంస్థ కార్యదర్శి బిలీల వెంకట శేషాద్రి తెలిపారు. నేడు బుధవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.... ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆయా కోర్టు ప్రాణంగణంలో జాతీయ లోక్ అదాల నిర్వహిస్తున్నట్లు తెలిపారు జాతీయ రాష్ట్రాన్ని సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా న్యాయ అధికార సంస్థ అధ్యక్షులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ. కబర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలు కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అన్ని నే స్థానంలో పెండింగ్లో ఉన్న రాజీ పడదగ్గ సివిల్,క్రిమినల్ మరియు ఫ్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకొని తమ కేసులను పరిష్కరించుకొని తమ విలువైన సమయాన్ని డబ్బును ఆదా చేసుకోవాలని సూచించారు.

## మోడల్ ప్రైమరీ పాఠశాలగా గుర్తించండి



మహానంది, మార్చి 5, (రిపబ్లిక్ న్యూస్): తమ్మడపల్లె గ్రామం ఎస్సీ కాలనీలో ఉన్న ఎంపీపీ పాఠశాలలో ఒకటి నుంచి 5వ తరగతుల వరకు 65 మంది విద్యార్థులు చదువుతున్నారని, మోడల్ ప్రైమరీ పాఠశాలగా గుర్తించాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం వారు మాట్లాడుతూ.. గతంలో ఇదే గ్రామంలో విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలను గుర్తించారని అన్నారు. విద్యార్థులు ఎక్కువగా ఉన్న ఈ పాఠశాలను కనీసం బేసిక్ ప్రైమరీ పాఠశాలగా కొనసాగించాలన్నారు

## మహానందీశ్వర దంపతులకు ఏకాంత సేవ

మహానంది, మార్చి 5, (రిపబ్లిక్ న్యూస్):
మహానందిలో శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి దంపతులకు బుధవారం రాత్రి ఏకాంతసేవ పూజలు నిర్వహించారు. ఫాల్గుణ మాసం సందర్భంగా స్థానిక యాగశాలలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెందూరి రవిశంకర్ అవధాని, అర్చకులు స్వామి, అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ప్రత్యేక పీఠంపై స్వామి, అమ్మవారిని కొలువు తీర్చి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

## నువ్వు కోడికత్తికి ఎక్కువ గొడ్డలికి తక్కువ అని మేం అనలేమా?: జగన్ వ్యాఖ్యలకు మంత్రి నాదెండ్ల కౌంటర్

**మార్చి05(రిపబ్లిక్ న్యూస్)**
11 సీట్లు వచ్చిన వాళ్లకు కూడా ప్రతిపక్ష హోదా కావాలంటే జగన్ జర్మనీ వెళ్లడం బెటర్ అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించడం... పవన్ కార్పొరేటర్ కు తక్కువ, ఎమ్మెల్యేకి ఎక్కువ అని జగన్ ఇవాళ వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఈ క్రమంలో, జగన్ కామెంట్స్ పై మంత్రి నాదెండ్ల మనోహర్ స్పందించారు. క్రిమినల్ మైండ్ తో వ్యాఖ్యలు చేసినట్టుగా ఉందని విమర్శించారు. ప్రత్యేకంగా ప్రెస్ మీట్ పెట్టి మరీ పవన్ కల్యాణ్ ను విమర్శించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. "నువ్వు కోడికత్తికి ఎక్కువ... గొడ్డలికి తక్కువ అని మేం అనలేమా? ఏ విధంగా బాబాయ్ హత్య జరిగిందో అందరికీ తెలుసు కదా! నోరుంది కదా అని వ్యాఖ్యలు చేయడం పద్ధతి కాదు" అంటూ నాదెండ్ల ధ్వజమెత్తారు. ఇక జగన్ ను వర్క్ ఫ్రమ్ బెంగళూరు ఎమ్మెల్యే అంటూ నాదెండ్ల ఎద్దేవా చేశారు. "సాధారణంగా ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలు అయిపోయాక తమ సొంత నియోజకవర్గాలకు వెళ్లి ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఈయన మాత్రం శాసనసభకు రాడు... తరచుగా బెంగళూరుకు వెళుతుంటాడు. మీరు ఏ విధంగా ప్రజా సమస్యలపై నిలబడతారో చెప్పండి. ప్రజలు మిమ్మల్ని ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారు... ఆ నిర్ణయాన్ని మీరు గౌరవించాలి కదా" అంటూ నాదెండ్ల వ్యాఖ్యానించారు.

# కేస్ కెనాల్ ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని ధర్నా



నంద్యాల మార్చి 5 (రిపబ్లిక్ న్యూస్):
కేసీ కెనాల్ ఆయకట్టుకు తక్షణమే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ నంద్యాల కె.సి.కెనాల్ కార్యాలయం దగ్గర రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు వై.యన్.రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, ఆధ్వర్యంలో కె.సి.కెనాల్ ఆయకట్టు రైతులు బుధవారం ధర్నా నిర్వహించారు.కేసీ కెనాల్ ఆయకట్టులో సుమారు 70000 వేల ఎకరాలు రబీ పంట కొనసాగుతోంది.. ఈ పంటలకు ఏప్రిల్ 30వ తేదీ వరకు నీరు అందించాల్సిన అవసరం ఉంది... కానీ అర్ధాంతరంగా కేసి కాలువలో నీటి విడుదలను ప్రభుత్వం నిలుపుదల చేయడం వలన పంటలు ఎండిపోవడం, రైతులు తీవ్రంగా నష్టపోవడం జరుగుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.
ఈ సంవత్సరంలో సుమారుగా 120 రోజులు కృష్ణా, తుంగభద్ర నదులు ప్రవహించి 1562 టిఎంసీల నీరు శ్రీశైలం ప్రాజెక్టులోకి భారీగా చేరినప్పటికీ అర్ధాంతరంగా నీటి విడుదలను ఎందుకు ఆపారో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.
గత సంవత్సరం బోటాబొటిగా వర్షాలు కురిసినా, శ్రీశైలంలో రిజర్వాయర్ కు చాలా తక్కువ నీరు చేరినప్పటికీ రబీ పంటలు పూర్తి అయ్యేంతవరకు నీటిని అందించిన విషయాన్ని రైతులు గుర్తు చేసారు.
ధర్నా అనంతరం రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షులు వై.యన్.రెడ్డి కె.సి.కెనాల్ ఎగ్జిక్యూటీవ్ అధికారి కి ఫోన్ ద్వారా మాట్లాడుతూ
రబీ పంటలను దృష్టిలో ఉంచుకొని, నీరు విడుదల చేయకపోతే తీవ్రంగా నష్టపోయే అంశాన్ని పరిగణనలోకి తీసుకొని, తక్షణమే కేసీ కెనాల్ లో నీటి విడుదలను పునరుద్ధరించి ఏప్రిల్ 30 తేది వరకు కొనసాగేలాగా కార్యాచరణ చేపట్టాలని విజ్ఞప్తి చేసారు.దీనిపై ఎగ్జిక్యూటివ్ అధికారి స్పందిస్తూ.. తాను పై అధికారుల దృష్టికి తీసుకొనివెల్తానని, దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారని అన్నారు. అనంతరం కె.సి.కెనాల్ సూపరింటెండెంట్ కు రైతులు వినతిపత్రం అందచేసారు.
ఈ కార్యక్రమంలో బెక్కం చిన్న రామకృష్ణారెడ్డి, .సుబ్బారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి మరియు కె.సి.కెనాల్ ఆయకట్టు పరిధిలో వివిధ మండలాల రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# రైతులు రసాయనాల వాడకాన్ని తగ్గించాలి.

**రైతు విశిష్ట సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి. -మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర్ రెడ్డి.**





మహానంది,మార్చి 5 (రిపబ్లిక్ న్యూస్):-
రైతులు రసాయనిక పురుగు మందుల వాడకాన్ని తగ్గించి,ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు.మహానంది మండలం గాజులపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతులు వరి పంటకు అవసరమైన మేరకే యూరియా ఎరువులు వాడాలని,విచక్షణారహితంగా ఎరువులు వాడితే పంటను పురుగులు, తెగుళ్ల అధిక స్థాయిలో ఆశించే అవకాశం ఉందన్నారు.రబీలో పంట నమోదు చేయించుకున్న రైతులు మార్చి 6వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.రైతులు సంబంధిత రైతు సేవ కేంద్రాలలో, రైతు రిజిస్ట్రేషన్ చేయించుకుని 11 నెంబర్లతో కూడిన రైతు విశిష్ట సంఖ్యను పొందాలన్నారు.భవిష్యత్తులో రైతు విశిష్ట సంఖ్య కలిగి ఉన్న రైతులకు మాత్రమే,వ్యవసాయ శాఖ ద్వారా సంక్షేమ పథకాలు అందుతాయని,రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.రైతులు సేంద్రియ,ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని,భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా, ఎరువులు వాడాలన్నారు.రైతులు తమ నేలను పరీక్షించుకోవడానికి ఏప్రిల్, మే నెలలు అనుకూలమైనవని, తప్పనిసరిగా తమ పొలాల్లోని మట్టిని పరీక్షించుకోవాలని తెలిపారు.ప్రతి రైతు నేషనల్ పెస్ట్ సర్వేలేన్స్ సిస్టమ్( %చీూూ ఖజూజూ%) యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని , తద్వారా పంటలో పురుగులు , తెగుళ్ల తెలుసుకోవడానికి, ఈ యాప్ చాలా ఉపయోగపడుతుందన్నారఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాసరెడ్డి,వీఏఏ లక్ష్మీకాంత్, రైతులు పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com